# ఆత్మీయులు

శ్రీవిరించి

"మీ గేయాలు, మీ కవిత్వం... చాల కష్టమా?" అనడిగాడు.

ఆమె నవ్వింది.

ఇంగ్లీషు మాట్లాడడం అంతగా అభ్యాసం లేనందువల్ల తడబడుతున్నట్లు, చేతివేళ్ల మధ్య 'కలం' పట్టుకున్నట్లు, గాలిలో వ్రాస్తున్నట్లు అభినయిస్తూ "అవును. చాల కష్టం- వ్రాయటానికి" అన్నది.

అతను కడుపార నవ్వాడు. ఈ తెలివయిన జోక్‌కు. "అయితే చదవటానికి కష్టం కాదన్నమాట!" అన్నాడు ఆ నవ్వుల మధ్యలోనే.

అతని నవ్వు ఆమెకు అర్థంకాలేదు.

అయినా తన చిరుమందహాసం కొనసాగిస్తూ "అంత కష్టంకాదు చదవటానికి-" అంది.

"బాగుంది. బాగుంది" అన్నాడు.

ఆమె నుంచి యిలా సూటిగా నిజాయితీగా జవాబు రావడం అతనికి ఉక్కిరి బిక్కిరి అయినట్లు అయింది.

అతను నలభయ్యో పడిలో వున్న బ్రహ్మచారి. స్ఫురద్రూపి. గిరజాల జుట్టు. రచయిత. ఒక మంచి పుస్తకం రాశాడు. కనుక పేరు వచ్చేసింది.

జీవితం యథాలాపంగా గడిచిపోతూ యింతవరకు పెళ్లి చేసుకోలేదు. కీర్తి ఆకాశం వయిపు పాకుతోంది. శక్తి మాత్రం ఉడిగిపోతోంది. తప్పనిసరి ఏదో వ్రాయవలసి రావడం, ఆ గుంజాటన, పదిమందిచేత చదివించాలనే తపన. సాహిత్యాన్ని గురించి మాట్లాడేందుకు ఆహ్వానాలు, రచనలు చదివేందుకు పిలుపులు... ఇటువంటి వాటి మధ్య గందరగోళమైన యాతనలో పడిపోయి వున్నాడు. ప్రభుత్వం అతనికి 'ట్రావెల్ గ్రాంట్' యిచ్చింది. దేశం చూచి రమ్మని, సంస్కృతికి ప్రతినిధిగా వివిధ ప్రాంతాలలో పర్యటనలు, జనంతో సమావేశాలు, తోటి రచయిత(త్రు)లతో సమాగమాలు... ఇలా కాలం అంతా వ్యయం అయిపోతుంది. యాంత్రికంగా ఈ పని చేసుకుంటూ పోతూ వుంటే ఏదో బరువు తరిగిపోతున్నట్లు, భయం తొలగిపోతున్నట్లు అనిపిస్తోంది.

రచయితల సమావేశాల్లో పాల్గొనడానికి న్యూఢిల్లీ చేరుకున్నాడు.

గాంధీ పీస్ ఫౌండేషన్‌లో మకాం. చాల గదులు వున్నాయి అక్కడ. ఒక గదిలో తను, యిద్దరు తమిళ సోదరులు. పక్కగదిలో అరుణ, మరో యిద్దరు. ఆ ముగ్గురూ మూడు భాషల్లో రాస్తారు. అరుణ సింధీలో కవిత్వం కూరుస్తుంది. మొదటి పరిచయంలోనే ఆమెను అభిమానించడం ప్రారంభించాడు అతడు.

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కోసం కిందకు దిగి వచ్చినప్పుడు టేబుల్ దగ్గర ఆమె ఒంటరిగా కూర్చుని వుంది. 'నమస్తే' చెబుతూ దగ్గరగా వెళ్లాడు.

"రండి, శ్రీధర్! ఏరీ మీ యిద్దరు దక్షిణ రచయితలు?" అంది ఆమె మాటలు కలగలుపుగా ఇంగ్లీషులో.

"మీ యిద్దరు రచయిత్రులను వెదకటానికి వెళ్లినట్లున్నారు. నేను ఒక్కడినే మిగిలిపోయాను-" అన్నాడు శ్రీధర్.

ఆమె నవ్వింది.

కాఫీ తాగుతూ వుండగా "అభ్యుదయ రచయితలా మీరు?" అనడిగింది.

"ఈ రోజుల్లో అభ్యుదయం కోరనివాళ్లు ఎవరుంటారు?" అంటూ ప్రశ్నను దాటవేశాడు. నిజానికి ఈ తేడాలు అతనికి అప్పుడూ, ఎప్పుడూ అర్థంకాలేదు. ఎలాగయినా వంట పట్టించుకోవాలని తీవ్రమయిన ప్రయత్నం చేసింది కూడా లేదు.

ఆమెను గురించి ముందు పరిచయం చేస్తూ లయిజన్ ఆఫీసర్ అన్నమాటలు గుర్తుకు వచ్చాయి.

"చాల ప్రచారంలో వున్న రచయిత్రి అరుణ. ఆమె పుస్తకాలు షాపులలో దొరకవు. అచ్చయిన వారం రోజులలో అయిపోయినాయి అంటారు పబ్లిషర్లు. రెండు లక్షల ప్రతులు- ఈసరికి సోల్డ్ ఔట్!"

ఆమె అడిగింది.

"మీ నవల పేరు ఏమిటన్నారు?"

"కొత్త నక్షత్రం"

ఈ నవల బాగా పేరు చేసుకుంది. ప్రతి యువకుడూ దీన్ని చదివాడు. ఆ రోజులలో అయితే దీన్ని గురించి చర్చించడం ఒక ఫేషన్. ఒక సింబల్ అయిపోయింది. కొత్త నక్షత్రం చదవనివాడివి నువ్వేం మనిషివి- అన్నట్లు చూచేవాళ్లు కాలేజి విద్యార్థులు, ఉద్యోగస్థులు- రిటైరయిన వాళ్లు కూడ.

అందులో అనేక పాత్రలు. ఏది కొత్త నక్షత్రమో యితమిత్థంగా తేలదు. ప్రతి మనిషీ... ఆడ మగ కూడా... తానే కొత్త నక్షత్రం అనుకుంటూ రోజులు గడిపివేయడం జరుగుతుంది.

ఆదాన్ ప్రదాన్ స్కీంలో దీన్ని యింకో అయిదేళ్లు అయిన తరువాత భారత భాషలన్నింటిలో ప్రచురింపజేస్తాం అనువదించి... అని భారత నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వారు అనధికారికంగా రహస్యంగా- అందుకనే ఈ లోపల కొందరు యితర భాషలవాళ్లు అనువాదానికి పర్మిషన్ అడిగితే శ్రీధర్ యివ్వకుండా తాత్సారం చేస్తున్నాడు.

కొందరు విమర్శకులు కొత్త నక్షత్రాన్ని ఏకిపారేశారు.

- ఇందులో ఏమీ సందేశం లేదు.
- చదువరులను నిరాశలో ముంచుతుంది.
- హాయిగా చదివించుకుపోదు. వర్ణనలు, సిద్ధాంతాలూ...!
- నూరు సంవత్సరాల క్రితమో, తరువాతనో రావలసిన పుస్తకం యిది.
- యిలా రకరకాల అభిప్రాయాలు ప్రచారం చేశారు.

ఈ అభిప్రాయాలు అతనికి మరింత 'బరువు' ఏర్పడేందుకు దోహదం చేసాయి.

"మీరు ఎక్కడ ఉంటారు?" అని అడిగింది ఆమె, అరుణ.

తన 'కార్డ్' తీసి యిచ్చాడు. "నేను ఎప్పుడూ అక్కడ వుండను. దేశం తిరుగుతూ వుంటాను. పోస్ట్‌వాళ్ల కోసం ఈ ఉత్తరం. అంతే!"

"భార్య.. పిల్లలూ?..." ఆమె ప్రశ్న ఊహించుకోవడం కష్టంకాదు.

"జీవితంతో అతి పరిచయం అయిపోయింది. వివాహం చేసుకోవడం పడలేదు-" అని బదులు చెప్పాడు.

దేశంలో సన్యాసుల సంఖ్య మరీ తగ్గిపోయింది. అందుచేత ప్రతి మనిషిలోను 'సన్యాసి మనస్తత్వం' కాస్తో కూస్తో చోటు చేసుకుంటూంది- అని అతని అభిప్రాయం. మనవాళ్లు ఎవరేనా ఈ ప్రశ్న అడిగితే యిదే సమాధానం చెబుతాను. కాని అరుణతో ఎలా?

తన రాష్ట్రం, తన ప్రజలు, అలవాట్లు, సాంఘీక పరిస్థితులు, కట్టుబాట్లు, సాహిత్య- రాజకీయ ఉద్యమాలు ఎలా బయలుదేరింది, వ్యాపించిందీ... యిదంతా అతను తీరుబాటుగా అలవోకగా మాట్లాడతాడు.

నిజానికి అతను దేశం నలుమూలల ప్రచారం చేసేది యిటువంటి అభిప్రాయాలే.

"ఓ మంచి పుస్తకం రాసిన దక్షిణ రచయితను కలు

సుకోవడం ఈ ట్రిప్‌లో నేను పొందిన లాభం!'' అంది అరుణ లిప్‌స్టిక్ చప్పరిస్తూ.

''పన్నెండు సంవత్సరాలు అయింది అది వ్రాసి-''

''తరువాత... యింకా ఏమేం రాశారు?''

''మరో మూడు.. మరీ అంత అభిరుచిదాయకం అయినవి కాదు. ఒకటయితే వ్యాసాల సంపుటి. ఓ పెద్ద నవల. దాన్ని ఆరు సంవత్సరాలు తీరుబాటుగా ఆలోచించి మరీ వ్రాశాను. చాల కష్టపడ్డాను దానికోసం. 'అనంతరం' అని పేరు దానికి. కాని ఎవరూ బాగుంది అనలేదు. రచన సాఫీగా సాగుతూ చకచక నడిపించుకుపోదు. అడుగడుగునా ఆలోచనలు రేకెత్తిస్తుంది.''

''నాకో ప్రతి యివ్వండి. చదివి 'చాల బాగుంది' అని వ్రాస్తాను.''

''ఇంగ్లీషుకు తర్జుమా కాలేదు.''

''ఫర్వాలేదు. మీ భాషలోనే యివ్వండి. చదివించుకుంటాను. సరస్వతికి ఏ భాష అయితేనేం? అక్షరం తరం లేదుగా...''

శ్రీధర్‌కు కాస్త గర్వం అతిశయం కలిగాయి.



''తప్పకుండా యిస్తాను. సాయంత్రం పట్టుకు వస్తాను-''

ఇద్దరూ తమ తమ గదుల్లోకి వెళ్లిపోయారు.

మంచి అనువాదకులు కూడా తారసపడతారు యిక్కడ. లయిజన్ ఆఫీసర్ ఒకతన్ని పరిచయం చేస్తూ అన్నాడు నిన్న. ''ఇతను 'అనాహాతం' అనే నవల అనువాదం చేశాడు గుజరాతీ నుంచి మా భాషకు. గట్టి వాడు?'' అని.

''అనాహాతం- చాల మంచి నవల. చదివిస్తుంది. మనను కొత్త కొత్త ఆకాశాల అంచులకు తీసుకుపోతుంది. అది చదివిన తరువాత ప్రతి పాఠకుడూ మరో ప్రపంచంలో అడుగుపెడుతున్నట్లే భావిస్తాడు-'' అన్నాడు ఆ అనువాదకుడు దాదాపు తన చెవులలో రహస్యం చెబుతున్నట్లుగా. ఇదంతా దేనికోసమో శ్రీధర్‌కు తెలుసు. తన నవల అనువాదం చేసే హక్కుల కోసం అడుగుతాడేమోనని భయం. వ్యాసాలు అయితే యివ్వవచ్చును అనుకున్నాడు మనసులో. అతను ఏమీ అడగకుండానే వెళ్లిపోయాడు మరో 'డెలిగేట్'తో మాట్లాడేందుకు- 'అమ్మయ్య' అనిపించింది శ్రీధర్‌కు.

తరువాత సభల మధ్య విరామంలో అరుణ కలుసుకుంది. ఇద్దరూ రెండు కుర్చీలు దగ్గరగా జరుపుకుని కూర్చున్నారు.

''మీరు కవయిత్రి. నేను చిన్నతనంలో- చిన్నప్పుడు కవిత్వం వ్రాశాను. ఛందస్సులు పద్యాలు వ్రాశాను. తరువాత ఫ్రీవెర్స్ కూడా'' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. ఊరికే కూర్చుండిపోయింది. బహుశ మాట్లాడదేమోనని భయం వేసింది అతనికి.

కాని ఒకటి రెండు నిమిషాలకు తేరుకున్నట్లు అయి ''మీరు యిప్పుడు ఏమంత పెద్దవారు అయినారని?'' అంది. తరువాత ఏవో సాహిత్యపు కబుర్లు చెప్పుకున్నారు.

అతను యింతవరకు దాదాపు ఓ పదిమంది స్త్రీలను ఆత్మీయంగా భావించాడు. ఈ ఆత్మీయత కొన్ని సందర్భాలలో చిరకాలం కొనసాగింది. కొన్ని సందర్భాలలో అయితే మూడునాళ్ల ముచ్చటే అయింది. కాని అందరూ అతని అంతరంగాన్ని ఒకేరకంగా ఆకర్షించారు. తన 'ఆరాధనామూర్తి'కి చాల దగ్గరగా వచ్చిన వాళ్లే అంతా. అతని మనస్సు ఎవరి ముందు కూర్చుని మాట్లాడుతూ వున్నా తన హృదయంలో పీఠం వేసుకు కూర్చున్న 'అతివ', మనసును ముంచెత్తిన ముగ్ధ, భావనలను ఆకట్టుకొన్న భామ... ముందు కూర్చున్నట్లే వుంటుంది. అందరూ ఆ మూర్తికి దగ్గరకు వచ్చినట్లే అనిపించేవారు. ఇప్పుడు సభాభవనంలో అరుణ ముందు కూర్చున్నపుడు అనిపిస్తూ వున్నది వేరు. తన మూర్తికి అతి చేరువగా వున్నది ఈమె. ఇంత మందిలో తననే వెదుక్కుంటూ వచ్చింది, చేరువలో కూర్చుంది. ఉదయపు వెలుగు కిరణాలు ఆమె చెక్కిళ్ల మీద పడుతున్నాయి. అవే తన వయిపు జారుతున్నాయి కూడా.



## పెద్దకర్ర

''ఏమిటి డ్వాక్టరుగారూ నాకు వచ్చింది అంత భయంకరమైన జబ్బా? అన్ని మందులు వ్రాశారు.'' ఆందోళనగా అడిగాడు పేషెంటు చాటభారతం లాంటి ప్రిస్క్రిప్షన్ చూసి.
''చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు పెద్దలు తెలీదా.'' వివరించాడు డ్వాక్టరు.

- పి.నాగభూషణం (అమలాపురం)

## వ్యాసం

వ్యాసం రాయనందుకు టీచర్ రాజును దండిస్తున్నాడు...
''నేను వ్యాసం రాశాను సార్. కానీ మా తమ్ముడు రెండేళ్ళవాడు దాన్ని చింపివేశాడు సార్.'' అన్నాడు రాజు.
''రెండేళ్ళ వెధవకు కూడా నచ్చలేదంటే అంత దరిద్రంగా తగలడిందన్నమాట నీ వ్యాసం.'' అని విసుక్కున్నాడు టీచర్.

- పి.వి.భైరవన్ (రాజంపేట్)

## వంటమనిషి

''ఈమధ్య మా యింట్లో వంట నాకు రుచించటంలేదు!'' చెప్పింది రాజ్యం.
''వంట మనిషిని మార్చొచ్చు కదా!''
''అది కుదరదులే. వంట చేసేది మా ఆయన.'' నసుగుతూ చెప్పింది రాజ్యం.

- నాగులవరం రాఘవి (ఆళ్లగడ్డ)

# కథావేదిక

ఒంటరిగా ప్రయాణం చేస్తున్న మనిషి ఒకరకమయిన ఊహా ప్రణయంలో చిక్కుకుంటాడు. కాని ఈ చిక్కులు త్వరగా తెమిలిపోతాయి. ఒకమారు ఒక నవలాకారిణి గురించి విన్నాడు.

''ఆమె ముందు నవలలు వ్రాసేవారు. తరువాత నాటకాలు వ్రాశారు. ఇప్పుడు సినిమాలకు సంభాషణలు వ్రాస్తున్నారు.'' ఆమె ఏమయినా చేయనీగాక. దూకటానికి మటుకు ఆరోగ్యంగా పుష్టిగా కన్నుల పసందుగా వుంది శ్రీధర్‌కు.

తరువాత సింధీ భాషలో ఓ రచయిత కలిశారు. ''నాకు అరుణ పరిచయమే. మంచి పిల్ల. నాకు జాలి!'' అన్నాడు.

''ఆమె పద్యాలు బాగుంటాయా?''

''చెప్పడం కష్టం. బొత్తిగా ఆడ కవిత్వం. ఎంతసేపూ కవితా ఊహాగానం. ప్రేమ, ప్రకృతి తప్ప భూమి-నీరు కనిపించవు.''

''మగ కవిత్వంలో మటుకు అంతకంటె యింకేం వుందిలెండి- కాకపోతే ఆకలి మరికాస్త హెచ్చు...''

''మొత్తం మీద సుకుమారంగా వుంటుంది ఆమె కవిత్వం.''

''సుకుమారం నిజాయితీకి నిదర్శనం గదా!''

''అవును. ఆమె నిజాయితీ వున్న రచయిత్రి- అందులో ఏమీ సందేహం లేదు.''

''మరి- జీవితంలో?''

''జీవితంలో కూడా.''

''ఆమె భర్త ఏం చేస్తారు?-'' అనడిగాడు శ్రీధర్ అమాయకంగా.

''అతను... యింకా పుట్టలేదు. ఆమె కవిత్వానికే అంకితం అయిపోయింది. కవితావేశంలో ఎంతగా కూరుకుపోయిందంటే వివాహం గురించి ఆలోచించేందుకు సమయం మిగల్లేదు ఆమెకు...''

శ్రీధర్ వెర్రివాడయిపోయాడు, ఈ మాటలు విని.

మనిషి అందచందాలకు- వివాహం అవడం, కాకపోవడంతో ఎలా సంబంధం లేదో ఆలోచించుకుంటూ ఉండిపోయాడు.

''సాయంత్రం ముగ్గురు కలిసే భోజనం చేద్దాం. ఆమెతో చెబుతాను-'' అన్నాడు ఆ కొత్త మిత్రుడు.

''అరుణ... ఆమె యింకెక్కడికయినా వెడతారేమో!''

''లేదు. నేను చెబుతానుగా!''

''మీ యిష్టం. నాకు ఆమె అంటే అభిమానం ఏర్పడుతోంది. అంత అందం, అంత సుకుమారం, మంచి కవిత్వం.. అందమూ, తెలివి ఒకటి అవడమూ, అద్భుతంగా చేరడమూ... అపురూపం కదూ!''

''ఇవేళ సాయంత్రమే, మరచిపోకండి-''

''అలాగే. నేను రేపు వెళ్లిపోతున్నాను కూడా!''

''అంత తొందరగానా? ఢిల్లీ అంతా చూడరా?''

''ఢిల్లీ నాకు చాల పాతది!''

అంతలో అరుణ కూడా అక్కడకు వచ్చింది.

''శ్రీధర్ రేపే వెళ్లిపోతారట'' అన్నాడు అతను ఆమెతో.

''అయితే పదండి'' అని బయలుదేరతీసింది ఆమె. ''నాకు జంతర్ మంతర్ ఎంతో యిష్టం. ఎన్నిమార్లు చూచినా లెక్కలేదు, తనివి తీరదు'' అంది అరుణ.

ఢిల్లీ వెళ్లిన వాళ్లందరూ 'కుతుబ్ మీనార్' చూస్తారు. ఆ రోడ్డుకు మూడు మైళ్లు యివతలే జయపూర్ మహారాజు నిర్మించిన నక్షత్ర శాస్త్ర పరిశోధనశాల వుంది. తనకు యిష్టం అయినవాళ్లతో ఈ స్థూపం చూడడం మరింత యిష్టం...'' అని చెప్పింది అరుణ.

''రాజా జయసింగ్‌కు లెక్కలంటే ప్రాణం. పద్దెనిమిదో శతాబ్దం ప్రారంభంలోనే యిక్కడ ఈ జంతర్ మంతర్ కట్టించాడు. తరువాత జయపూర్, బెనారెస్, ఉజ్జయిని... మధురలలో కట్టించాడు.''

''మీకు ఎస్ట్రానమీలో పరిచయం వుందా?'' అనడిగాడు శ్రీధర్.

''ఊహూ, రాజా జయసింగ్‌ను తలుచుకుంటేనే వెర్రి ప్రేమ. అంతే!''

...

''ఇక్కడ ఎన్ని యంత్రాలు వున్నాయనుకున్నారు?'' అంది కళ్లు పెద్దవి చేస్తూ, వాళ్లు 'సామ్రాట్ యంత్రం' దగ్గరకు రాగానే. ఆమే చెప్పుకుపోతోంది, అతి ఉత్సాహంగా ''నాలుగు యంత్రాలు, ఆరు స్థూపాలు-''

'రామ యంత్రం' స్థూపాల ముందు నిలుచున్నారు. వలయాకారంగా జంట స్థూపాలు.

''రెండూ కలిసి ఒకటే యంత్రం, సూర్యుడు ఏ అక్షాంశరేఖ మీద వున్నాడో చెబుతాయి యివి. సూర్యోదయ సమయంలో స్తంభం నీడ గోడ ఉపరితలం మీద పడుతుంది. సూర్యుడు ఆకాశంలో పైకి కనిపిస్తున్నకొద్దీ స్తంభం నీడ ఈ గోడమీదకు కిందకు జారుతుంది... ఈ లెక్కలన్నీ నాకు తెలియవు. అర్థంకావు. అంతగా అభిరుచి కూడా కాదు. కాని... కాని... ఈ స్థూపాలు, యంత్రాలు, స్తంభాలు వీటి సహాయంతో గ్రహగతులు కనుక్కోవడం అనే ఆలోచన నన్ను ముగ్ధురాలిని చేస్తుంది-'' అంది అరుణ.

తరువాత జయప్రకాశ యంత్రం, మిశ్ర యంత్రం... అన్నీ వివరంగా తిప్పుతూ చూపింది. సూర్యుడు ఏ రాశిలో ప్రయాణం చేస్తున్నాడో ఒక యంత్రం చూపిస్తుందని చెప్పింది.

''పంచాంగం, పుస్తకాలు, ఆధారం లేకుండా ఈ యంత్రాలతో గ్రహగతులు స్పష్టంగా మనకళ్లతోనే చూడవచ్చును. ఆధునిక శాస్త్ర విజ్ఞానం యింకా స్పష్టంగా చెప్పని విషయాలు... మన మహారాజులు కొన్ని శతాబ్దాల వెనుకనే నిర్మించి చూపారు. అద్భుతం కదూ?'' ఇంకా ఏమేమో చెబుతోంది.



శ్రీధర్‌కు మటుకు వెనకటి మాటలే చెవులలో మెదులుతున్నాయి.

''సూర్యుడు ఏ రాశిలో ప్రయాణం చేస్తున్నాడో చెబుతుంది ఈ యంత్రం-'' అని అరుణ అన్నప్పుడు 'అరుణా! మన ప్రయాణం ఏ రాశిలో?-' అనిపించింది శ్రీధర్‌కు. అడగాలనుకున్నాడు. కాని తాను ఎక్కడ? అరుణ ఎక్కడ?

నక్క-నాగలోకం కాకపోవచ్చును.

సింధీ కన్య. కవిత్వం రాసి ప్రఖ్యాతి పొందుతున్న విదుషి.

తన ఆరాధన మూర్తికి అతి దగ్గరగా వచ్చిన మనిషి.

కాదు... తన ఆరాధన మూర్తే అరుణకు దగ్గరగా వచ్చింది. అరుణను చూడకముందే ఆ మూర్తి నాకు కనులకు ఎట్లా రూపు కట్టిందబ్బా... అని ఆశ్చర్యపడసాగాడు శ్రీధర్.

కాని.. కాని... శారీరకంగా, మానసికంగా ఎంత దూరం!

ఆమె అభిరుచులు వేరు. తన అభిరుచులు ఏమిటో తనకే యితమిత్థంగా తెలియవు. అంతా అయోమయం.

జంతర్ మంతర్ స్థూపాలను గురించి, వాటి వివరాలు కవిత్వంలాగ చదివేస్తోంది అరుణ.

రాజా జయసింగ్ మాట వచ్చినప్పుడు ఆమె నేత్రాలు వికసించి కలువ పువ్వులు అవుతున్నాయి.

''ఈ ఫోటోలు మీ దగ్గర వున్నాయా?'' అని అడిగింది.

'నాకు ఇంటరెస్ట్ తక్కువ-' అందామనుకున్నాడు గాని ఆమె చిన్నబుచ్చుకుంటుందేమోనని నవ్వి ఊరుకున్నాడు.

ఒక సెట్ కలర్ ఫోటోల పాకెట్ తనకోసం 'గైడ్' దగ్గర కొనుక్కు వచ్చింది. తనకు యిచ్చింది. 'పారేసుకోకండి- జాగ్రత్తగా మీ ట్రావెల్ కిట్‌లో వుంచుకోండి. ఏ ఊరు వెళ్లి నాదగ్గర వుంటుంది. మీరు ఏ అక్షాంశ రేఖలో వున్నారో తెలుస్తుంది'' అంది నవ్వుతూ.

'పారేసుకుంటానా? ప్రేమ కానుకలాగ భద్రంగా హృదయంలో దాచుకోనా?' అనుకున్నాడు.

ఆ సాయంత్రం భోజనం బిల్లు దగ్గర ఓ పంజాబీ కవయిత్రి గురించి ప్రస్తావన వచ్చింది.

''ఆమె చాల మంచిది. నన్ను తల్లిలా ఆదరిస్తుంది'' అంది అరుణ.

''అలాగా!''

''ఆమెకు సింధీ భాష కూడా వచ్చు. కాని పుస్తకంలో వ్రాసినట్లుగా వుంటుంది ఆ భాష గ్రాంధికం'' అంది.

''కవిత్వం వ్రాసేవాళ్లు చాలమంది స్త్రీలు వున్నారా మీ భాషలో!''

''ఆ! స్త్రీల పరంపర మాది.''

''మాకూ వున్నారు. చాలమంది. సినిమాలకు పనికి వచ్చే నవలలు వ్రాసేవాళ్లు పూర్వం.''

''నా పద్యాలు వినాలని వుందా మీకు? లేదు కదూ?''

''తప్పకుండా వింటాను. అదేం మాట!''

''కాని నాకు మీరు ఎలా వ్రాస్తారో, ఏం వ్రాస్తారో తెలుసుకోవాలని వుంది.''

అతను బహు నిదానంగా తాపీగా వివరించాడు. తన కథలు, నవలలు, వ్యాసాలు... అందులో పాత్రల గురించి! అందరూ జీవతం ఒడ్డున పై పై అనురాగాలతో, లోతులు లేని హృదయాలతో ఎలా తేలి ఆడుతారో, అర్థం పర్థంలేని పనులు చేస్తారో, తమకు ఏం కావాలో తెలియక ఎలా తపన పడతారో... యిదంతా చెప్పాడు.

కాని తన పుస్తకం- మొదటి నవల తరువాత ప్రతిదీ కూడా దెబ్బతిన్నది.

తన ఆకాశం అంత కీర్తిని నిలబెట్టలేదు. ఈ సంగతి కూడా చెప్పాడు.

''వచన రచన చాల సుగమంగా 'హాపీ'గా వుంటుంది గదూ!'' అంది ఆమె.

''అద్దంలో మనుషులను వాళ్ల ప్రతీకలను లోతులను చూపటానికి కవిత్వమే మంచిది!''

''ఆ పని మీరు వచనంలో చక్కగా చేస్తున్నారు గదా!''- ఈ వాక్యాన్ని అభినందనగా తీసుకున్నాడు శ్రీధర్.

''ప్రేమకు కవిత్వమే మంచిది!''

''ప్రేమ?-- జీవితంలో యింకేం పని లేనట్లు...''

ఆశ్చర్యంగా చూచింది అతనివంక.

ఆమె ఒక కవిత సంపుటి అతనికి యిచ్చింది. ముందు పేజీ మీద సంతకం చేసింది. సంతకానికి పైన ఏమో వ్రాసింది.

అక్షరాలు ముద్దుగా, ఆప్యాయంగా కనిపించాయి.

''జంతర్ మంతర్ ఫోటోల సెట్ కవితా సంపుటం కంటే విలువయినది. అరుణకు తన కవిత్వంకంటే రాజా జయసింగ్ స్థూపాలే ప్రియమయినవి- అయి నట్లు'' అనుకున్నాడు శ్రీధర్.

అతను అంతకు ముందే సిద్ధం చేసుకు వచ్చిన ఒక 'ప్రతి' నవల ఆమెకు అందించాడు. అది 'అనంతరం.' బాగా లావుగా వుండి అతనికి పేరు తీసుకురాని నవల. ఆమె చేతులలో పుస్తకం వుంచుతూ ''లోపల పేజీలు తీసి చూడకండి- మీ ఊరు వెళ్లేవరకూ!'' అన్నాడు.

లోపల పేజీలో అందంగా ఇంగ్లీషులో ఆమెకు చప్పున అర్థం అయ్యే భాషలో-

''అరుణ రాణికి- ఈ పవిత్ర దేశంలో మీరు ఆ కొసను- నేను ఈ కొసను పుట్టి పెరగడం నాకు చాలా ఖేద కారణం!'' అని వ్రాశాడు.

★

## 3 నాలుకలు!

ఈమధ్య చైనాలో ఓ చిత్రం జరిగింది. ఓ డ్యాక్టర్ దగ్గరకు 32 సం.రాల ఒక వ్యక్తి వచ్చి తన 'నాలుక'లకు (అవును నాలుకలే) వైద్యం చెయ్యమని కోరాడు! అతని నోట్లో ఏకంగా 3 నాలుకలు ఉండడం చూసి డ్యాక్టర్ దిగ్భ్రాంతి చెందాడు. అబద్ధాలు చెప్పేవారినీ, మాట నిలబెట్టుకోనివారినీ, రెండు నాలుకల మనిషి అని మనం అంటూ ఉంటాం. 3 నాలుకలున్న చైనా వ్యక్తి అనేక అబద్ధాలు చెప్పొచ్చు! ఎన్నో పదార్థాల రుచులను ఒకేసారి చూడొచ్చును! ఇదేదో, భలేగా ఉందే!

## గుర్రాలకు లంగోటీలు!

ఆస్ట్రేలియాలోని ఒక కంపెనీవారు గుర్రాలకు లంగోటీలను తయారుచేశారు. వీటికే వారు 'నాపీస్' అనే నామధేయం పెట్టారు. వాటిని గుర్రాలకు తొడగడం వలన గుర్రపుశాలలు శుభ్రంగా ఉండి, క్రిములవల్ల వాటికి కలిగే బాధ తగ్గుతుందని, సదరు లంగోటీ వాలాలు సెలవిచ్చారు. ఓ వెయ్యి హార్సాలపై వారు పరిశోధన జరిపి, ఈనాపీస్‌లను రూపొందించారట. గుర్రాలకు లంగోటీ అంటేనే తమాషాగా ఉంది కదూ!

## 'హాపీ బర్త్‌డే'

'హాపీ బర్త్‌డే టూయూ' అనే పాటను మనం తరుచూ, అనేక అనేక మంది పుట్టిన రోజులనాడు వింటూ ఉంటాం. చెప్తూ ఉంటాం. ఈ పాటను కెంటకీలోని ఇరువురు లేడీ టీచర్లు వ్రాశారు.

- కొడిమెల

